


# కరపత్రం

SINCE 2014

గురువారం అక్టోబరు 23 2025 | సంపుటి : 2 | సంచిక : 20 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ఇది మంచి ప్రయత్నం..

### కానీ పుతిన్ అంగీకరిస్తారో లేదో: జెలెన్‌స్కీ



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే యుద్ధం ఆపేందుకు ఇటీవల ఆయన కొన్ని ప్రతిపాదనలు చేశారు. వారు ఎక్కడున్నారో అక్కడే యుద్ధాన్ని ఆపి చర్చలు జరపాలని ఇరుదేశాలకు సూచించారు. ఈ విషయంపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. పేజి 2లో ▶

## భారీగా దిగొచ్చిన పసిడి..

### ఒక్క రోజులోనే రూ.9వేలు తగ్గిన బంగారం



హైదరాబాద్: రికార్డు ధరలతో ఇటీవల ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు తాజాగా కాస్త దిగొస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం పసిడి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ. 9వేలకు పైగా తగ్గడం గమనార్హం. అటు వెండి ధర కూడా దిగొచ్చింది.బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 గ్రాముల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ. 1,25,250కి పడిపోయింది. పేజి 2లో ▶

## ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి



- ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
- నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష నిర్వహించారు.
- నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.
- అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

2 లో

### ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాయదుర్గం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో గ్లోబల్ ఈవెంట్స్ ఆఫ్ పయనీరింగ్ అండ్ అడ్వాన్సింగ్ క్వెస్ట్ (జియో ప్యాక్) ఆధ్వర్యంలో 2 లో

## భారత్‌లో పెట్టుబడులకు ఏపీ గేట్ వేగా మారింది: మంత్రి లోకేశ్



భారత్-ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఏపీది కీలక పాత్ర అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా ఉందన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేశ్.. బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాలు అమలవుతున్నాయని చెప్పారు. గత 16 నెలల్లో ఏపీకి రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. విశాఖలో రూ. 1.33 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిందని వివరించారు.
ఏపీలో పారిశ్రామికవేత్తల కోసం సులభతర పాలసీలు అమలుచేస్తున్నట్లు చెప్పారు ఆర్సెలార్ మిత్తల్ సంస్థ రూ. 1.35 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ నిర్మించబోతోందని వివరించారు. ప్రస్తుతం భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్ వేగా మారిందన్నారు. నవంబర్‌లో 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025కి హాజరుకావాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తి: మంత్రి పార్థసారథి



కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి రూ. 7.65 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా 7.28 లక్షల ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. పేజి 2లో ▶

## విద్యాసంస్థలకు బకాయిలు చెల్లించాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు: బండి సంజయ్



హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యాసంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు."బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలి. 2లో ▶

## షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్.. పరిశీలిస్తున్నాం: మంత్రి పొన్నం



హైదరాబాద్: దిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2లో ▶

## గోండు బెబ్బులి కుమ్రం : కేటీఆర్



ఆదివాసీ యోధుడు.. తిరుగుబాటు వీరుడు.. గోండు బెబ్బులి కుమ్రం (కొమురం) భీమ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. బీఆర్ఎస్ హయాంలో, కేసీఆర్ నేతృత్వంలో కుమ్రం భీమ్ ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే స్ఫూర్తిగా పాలన అందించామని గుర్తుచేశారు. వారి ఆశయాల సాధన దిశగా పయనించామని తెలిపారు. ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం.. కుమ్రం భీమ్ స్ఫూర్తిగా ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీమ్ పేరు పెట్టుకున్నందుకు, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసినందుకు, హైదరాబాద్ మహానగరంలో కుమ్రం భీమ్ పేరిట ఆదివాసీ భవనాన్ని నిర్మించినందుకు గర్విస్తున్నామన్నారు. అస్తిత్వ పోరాటాలకు ప్రతీకగా నిలిచిన కుమ్రం భీమ్‌కు జోహార్లు తెలిపారు.

## హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకోం

### ఎన్నికల హామీలు అమలు చేయాలి : గ్యాదరి కిశోర్



2లో ▶

## మనస్తాపంతో భార్య, బాధతో భర్త ఆత్మహత్య

ప్రేమించి పెళ్లి చేసుకున్న కొద్దిరోజులకే విషాదం



2లో ▶

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం అక్టోబరు 23 2025

# ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్-2025 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన పరిశోధన సంస్థలు, పరిశ్రమలు హైదరాబాద్‌లో స్థాపించి బీజం వేశారని అన్నారు. నాటి నుంచి బీడీఎల్, డీఆర్‌డీవో, రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ తదితర ప్రఖ్యాత సంస్థలు అభివృద్ధి చేస్తూ వస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో నగరంలో ఐఐటి, ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ, ఉస్మానియా యూనివర్సిటీ వంటి విద్యా సంస్థలు శాస్త్ర సాంకేతిక రంగాలకు దన్నుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫార్మా, ఐటీ, రక్షణ వంటి అనేక రకాల క్లస్టర్స్‌లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయన్నారు. అంతరిక్షరంగంలోనూ క్లస్టర్ ఏర్పాటు చేసి ఆ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జియో ప్యాక్ సీఈఓ, వ్యవస్థాపకుడు ముర్తజ కురసాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తి: మంత్రి పార్థసారథి

మొదటి పేజీ తరువాయి

"ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని సర్వేలో తేలింది. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్బన్ ప్రాంతాల్లో వచ్చే నెల 5 వరకు అర్హుల ఎంపిక ప్రక్రియ కోసం సర్వే చేపడుతున్నాం. పట్టణాల్లో ఇళ్లు లేని పేదలు వచ్చేనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చుప్రభుత్వంలో ఎక్కడైనా, ఏదైనా తప్పు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు. కొన్ని పత్రికలు కావాలనే తప్పుడు రాతలు రాస్తున్నాయి. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానం అమలుపై వైకాపా నిరసనలను తీవ్రంగా ఖండిస్తున్నాం" అని మంత్రి పార్థసారథి అన్నారు.

## రవాణాశాఖ కీలక నిర్ణయం.. తెలంగాణలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు



హైదరాబాద్: తెలంగాణ రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ సాయంత్రం 5గంటల నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలు సంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

# ఇది మంచి ప్రయత్నం..

మొదటి పేజీ తరువాయి

ట్రంప్ చేసిన ప్రతిపాదనలు సరైనవేనని..రాజీ చేయడానికి ఇది మంచి ప్రయత్నమని సమర్థించారు. అయితే దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరిస్తారో లేదో అని అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తాను అమెరికా అధ్యక్షుడికి కూడా తెలియజేసినట్లు వెల్లడించారు.ఇటీవల ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ లోని అత్యంత కీలకమైన దొనెట్స్క్ ప్రాంతాన్ని తమకు అప్పగించాల్సిందేనని రష్యా అధ్యక్షుడు పట్టిబట్టినట్లు పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటి తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్‌లను ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు పుతిన్ సానుకూలతను వ్యక్తం చేశారని.. దీనికి ప్రతిగా ఉక్రెయిన్ దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు కథనంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇరుదేశాల నేతలకు పలు ప్రతిపాదనలు చేశారు.

**ఉక్రెయిన్‌పై రష్యా దాడి..**

ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై మంగళవారం అర్ధరాత్రి రష్యా డ్రోన్..క్షిపణి దాడుల (%=బంంఖుఅ ఎతీశీఅవ, ఎఱంంఱశ్రీవ ఖ్మఎ%)కు పాల్పడింది. ఈ దాడుల్లో ఓ చిన్నారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని పలు ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని..బుధవారం కూడా రష్యా దాడులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ దాడిలో 18మంది గాయపడినట్లు కీవ్ పరిపాలన అధిపతి తైమూర్ వెల్లడించారు. దాడి కారణంగా దేశవ్యాప్తంగా అత్యవసర విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా యుద్ధం ముగింపుపై త్వరగా ఓ నిర్ణయం తీసుకోవాలని ట్రంప్ పుతిన్‌కు సూచించినప్పటికీ కీవ్‌పై మాస్కో దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

# భారీగా దిగొచ్చిన పసిడి..

## ఒక్క రోజులోనే రూ.9వేలు తగ్గిన బంగారం

మొదటి పేజీ తరువాయి

22 క్యారెట్ల ధర రూ.1,14,843గా ఉంది. ఇక వెండి ధర దాదాపు రూ.7వేలు తగ్గింది. నేడు కేజీ వెండి ధర రూ.1,58,000 పలుకుతోంది. వెండి ధర వారం రోజుల్లో దాదాపు రూ.28వేలు తగ్గింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 47.84 డాలర్లకు చేరింది.

ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# అల్పపీడనం ప్రభావం..

## ఏపీలో 6 జిల్లాలకు రెడ్ అలర్ట్

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో



వర్షాలు కురుస్తున్నాయి. నేడు ఏపీలోని ప్రకాశం, వైఎస్ఆర్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. పల్నాడు జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలోని పలు చోట్ల వర్షం పడుతోంది.

నెల్లూరు జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తోంది. ఏఎస్ పేట వద్ద గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. పలు చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. చేజెర్ల, అనంతసాగరం ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యా సంస్థలకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సెలవు ప్రకటించారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల దృష్ట్యా కలెక్టరేట్‌లో 0861 2331261, 79955 76699 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కడప జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. కాలువల్లో వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని నగరపాలక సిబ్బంది తొలగిస్తున్నారు. అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు.

పొంచి ఉన్న వాయుగుండం ముప్పు రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉంది. నైరుతి బంగాళాఖాతం-ఉత్తర శ్రీలంక మధ్య అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్యంగా కదిలి నైరుతి, పశ్చిమ బంగాళాఖాతం మధ్య మధ్యాహ్నం వాయుగుండంగా మారే అవకాశముంది. వాయవ్యంగా కదిలి 24 గంటల్లో వాయుగుండం మరింత బలపడే అవకాశముంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపు వాయుగుండం కదిలే అవకాశముంది. తమిళనాడు, కేరళలో వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మధ్యాహ్నం నుంచి తీరం వెంట 30-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందిని తెలిపారు.

# షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్.. పరిశీలిస్తున్నాం: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

"రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుంది" అని మంత్రి పొన్నం అన్నారు.

## హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

హామీలు అమలు చేయడం చేతకాదు గానీ, ప్రతిపక్షాలపైనే విమర్శలు చేయడం చేతనేతదా అని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాలు విసరడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సొల్లు లక్ష్మణ్, దున్నపోతు అని అన్నా కూడా స్పందించని వ్యక్తి.. ఇవాళ హరీశ్‌రావుకు సవాలు విసరడం సిగ్గుచేటని విమర్శించారు. రాహుల్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గ్యాదరి కిశోర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కేబినెట్‌లో జరిగిన విషయాలపై మాత్రమే హరీశ్‌రావు మాట్లాడారని తెలిపారు. హరీశ్‌రావు కాలి గోటికి సరిపోని వాళ్లు కూడా సవాలు విసురుతున్నారని మండిపడ్డారు. అడ్లూరి లక్ష్మణ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడారని అన్నారు. మంత్రి అడ్లూరిని పట్టుకుని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ దున్నపోతు అన్నప్పటికీ స్పందించలేదని అన్నారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై గుడికి వెళ్లి ప్రమాణం చేస్తావా అని సవాలు విసిరారు. గజినీ మహ్మద్‌లాగా ఐదుసార్లు పోటీ చేశాక అడ్లూరి లక్ష్మణ్ గెలిచి.. చివరకు మంత్రి అయ్యారని అన్నారు. నియోజకవర్గంలో అడ్లూరి లక్ష్మణ్‌ను సొల్లు లక్ష్మణ్ అని అంటారని.. నువ్వు చెప్పే సొల్లు మేం వినాలా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరులకు గన్‌మెన్లను ఎందుకు ఇస్తారని ఆమె అడిగారని తెలిపారు. డెక్కన్ సిమెంట్ కమీషన్ల కోసమే గొడవంతా జరిగిందని.. దీనిపై సీఎం పిలిచి సెటిల్‌మెంట్ చేయలేదా అని నిలదీశారు. రోహిన్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ ఇద్దరూ కలిసి తుపాకీ పెట్టి బెదిరించారని కొండా సురేఖ కుమార్తె చెప్పారని.. ఇంతకు ఆ తుపాకీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఇంత చేస్తున్న మీది దండుపాళ్యం బ్యాచ్ కాకపోతే ఇంకేటని నిలదీశారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి జడ్పీటీసీగా పోటీ చేస్తే వంకాయ గుర్తుపై 100 ఓట్లు వచ్చాయని గ్యాదరి కిశోర్ కుమార్ తెలిపారు. చామల ఒక చీటర్ అని.. రాహుల్ సంతకాన్ని ఫోర్జరీ చేస్తే.. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. వీళ్లంతా ఓటీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు అని.. ఒక్కసారి మాత్రమే గెలిచారని.. మళ్లీ గెలవరని పేర్కొన్నారు. ఇదంతా చూస్తుంటే ఆలీబాబా 40 మంది దొంగలు కాదు.. సీఎం .. ఆ నలుగురు దొంగల్లా అనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇకపై హరీశ్‌రావు మీద మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి అని హెచ్చరించారు. మీరు ఒక్కటంటే మేం వంద అంటామని అన్నారు.

## మనస్తాపంతో భార్య, బాధతో భర్త ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

ఆరేళ్లుగా ప్రేమించి పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. కానీ చిన్న చిన్న విషయాలకే మనస్తాపానికి గురై ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దసరా రోజు భర్త తిట్టాడనే మనస్తాపంతో పెళ్లయిన వారం రోజులకే క్షణికావేశంలో భార్య బలవన్మరణానికి పాల్పడింది. తన వల్లే తన అర్ధాంగి చనిపోయిందనే మనస్తాపంతో దీపావళి నాడు భర్త కూడా తనువు చాలించాడు. అలా సక్సెస్ అయ్యిందనుకున్న వారి లవ్‌స్టోరీ.. పెళ్లయిన నెలలోపే విషాదాంతంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలోని వడ్డెర కాలనీలో ఎదురెదురు ఇండ్లలో ఉండే సంతోష్, గంగోత్రి ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. తమ ప్రేమను పెద్దలకు చెప్పి ఒప్పించి సెప్టెంబర్ 26న పెళ్లి కూడా చేసుకున్నారు. దసరా పండుగ కావడంతో ఈ నెల 2వ తేదీ న దంపతులిద్దరూ గంగోత్రి ఇంటికి వెళ్లారు. అక్కడ మాంసం కూరలో కారం ఎక్కువైందని గంగోత్రిని సంతోష్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన గంగోత్రి.. అదే రోజు రాత్రి అత్తారింటికి వెళ్లాక దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లిచేసుకున్న అమ్మాయి తన కారణంగానే తనువు చాలించిందని సంతోష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మనసు బాగోలేకపోవడంతో దీపావళి పండక్కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉండే తన అక్క దగ్గరకు వెళ్లాడు. అక్కడే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇలా భార్యాభర్తలిద్దరూ కూడా నెలలోపే మరణించడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## విద్యాసంస్థలకు బకాయిలు చెల్లించాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. జూబ్లీహిల్స్‌లో భాజపా గెలవడం ఖాయం" అని బండి సంజయ్ తెలిపారు.

కేంద్ర మంత్రి అమిత్ షాకు బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "నాకు రాజకీయ మార్గదర్శి, గురువు అమిత్ షా. దేశం ఫస్ట్ అనే ఆలోచనతో జీవించే, శ్వాసించే నేత ఆయన. రాజకీయాలను వ్యూహంతో, సేవతో చూడగల తత్వాన్ని అమిత్ షా నుంచే నేర్చుకుంటున్నా. ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా అయోమయానికి గురికాకుండా ప్రశాంత మనసుతో ఆలోచించే నాయకుడు ఆయన. దీర్ఘాయుష్షు, ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నా" అని బండి సంజయ్ తెలిపారు.

## మరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం..

దుబాయ్ లోని ప్రముఖ రియాల్టి సంస్థ శోభా గ్రూప్ ఫౌండర్ ఛైర్మన్ పీఎన్సీ మీనన్‌తో సీఎం సమావేశం అయ్యారు.పీ4 విధానంలో జీరో పావర్టీకి ప్రభుత్వ పరంగా చేస్తున్న ప్రయత్నాలను చంద్రబాబు వివరించారు. రాజధానిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నట్టు తెలిపారు. శోభా రియాల్టి సంస్థ కూడా ఇందులో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఏపీకి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని పీఎన్సీ మీనన్‌ను కోరారు. శోభా రియాల్టీ లాంటి దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సరైన గమ్యస్థానం ఏపీ అని వివరించారు. 3 ఏళ్లలో అమరావతిలో రహదారులు, నీటి సదుపాయం, నైపుణ్యం ఉన్న మానవ వనరులు వంటి మౌలిక సదుపాయాలు సిద్ధం అవుతాయని తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా ఏఐ హబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు కానున్నాయని వివరించారు. రాష్ట్రంలోని తిరుపతి, విశాఖ, అమరావతి లాంటి నగరాలకు ప్రతిష్టాత్మక సంస్థలు వస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలు, కార్యక్రమాలను శోభా గ్రూప్ ఛైర్మన్ పీఎన్సీ మీనన్.. సీఎం చంద్రబాబుకు గుర్తు చేశారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని మీనన్‌ను సీఎం ఆహ్వానించారు.

## సీట్లపై కుదరని సయోధ్య.. లాలూతో అశోక్ గహ్లోత్ భేటీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'లో ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్ని స్థానాల్లో కూటమికి చెందిన కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష పార్టీల మధ్యే పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ఆర్జేడీతో నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ రంగంలోకి దిగారు. బుధవారం ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌తో సమావేశమయ్యారు.

"బిహార్ లో ప్రతిపక్ష కూటమి గెలవడం ఎంతో ముఖ్యం. మహారాష్ట్రలో 'మహావికాస్ అఘాడీ' ఓటమి తర్వాత వస్తున్న ఎన్నికలు ఇవి. బిహార్ ఎన్నికలు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. సమాజంలో విభజనలకు కారణమైన, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ఎన్డీయేను ఓడించాల్సిన అవసరం ఉంది. బిహార్ ప్రజలు ఈ పని చేయగలరు" అని



లాలూతో భేటీ అనంతరం గహ్లోత్ మీడియాతో మాట్లాడారు. గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నామని, అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతామన్నారు.

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇచ్చేందుకు గహ్లోత్ నిరాకరించారు.

"రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ మధ్య మంచి అనుబంధం ఉంది. బిహార్‌లో ఇటీవల నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇది నిరూపితమైంది. ఇరునేతలు రాష్ట్రమంతా పర్యటించారు. వారు సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారు" అని తెలిపారు. ఎన్డీయే కూటమిలో తమకన్నా ఎక్కువ విభేదాలు ఉన్నాయని విమర్శించారు.

బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 143 సీట్లలో ఆర్జేడీ, 61 సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాయి. దాదాపు ఐదు నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల అభ్యర్థులూ బరిలో ఉన్నారు. మరో మూడు సీట్లలోనూ సొంత కూటమి అభ్యర్థులపై హస్తం పార్టీ పోటీకి దిగింది. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో గహ్లోత్ ఈ వ్యవహారంపై మాట్లాడుతూ.. ఐదు- పది సీట్లలో స్నేహపూర్వక పోటీ పెద్ద విషయం కాదని వ్యాఖ్యానించారు. లాలూతో భేటీ అనంతరం.. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నాటికి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొనడం గమనార్హం.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం అక్టోబరు 23 2025

# పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల 22 అక్టోబర్ కరపత్రం ప్రతినిధి**
జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు చేపట్టనున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మంచిర్యాల మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం లతో కలిసి సి. సి. ఐ. అధికారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వహకులతో పత్తి కొనుగోలు అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సి సి ఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కనీస మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి కనీస మద్దతు ధరతో లబ్ధి పొందాలని తెలిపారు. 2025- 26 సంవత్సరంలో కనీస మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12 శాతం కంటే తక్కువగా ఉండాలని, నాణ్యతలేని / రంగు మారిన / వర్షానికి తడిసిన పత్తిని కొనుగోలు చేయడం జరగదని, రైతులు విక్రయించేందుకు విడి పత్తిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ జరిగిన తరువాతనే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు తమ ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నెంబర్ అనుసంధానం నవీకరణ చేసుకోవాలని తెలిపారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ డేటా ప్రకారం ధ్రువీకరణ చేయాలని, పత్తిలో తేమ శాతం, కనీస మద్దతు ధర, నిబంధనలు తెలిసేలా గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి పత్తి జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సి.సి.ఐ. కేంద్రాలలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోకి అనుమతించకూడదని తెలిపారు. రెవెన్యూ అధికారి, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.

**ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.**

# బంగారం చోరీ కేసులో మహిళా అరెస్టు



**కుకునూర్ పల్లి అక్టోబర్ 22 కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా కుకునూర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడకండ్ల గ్రామంలో జరిగిన దొంగతనాన్ని చేధించినట్లు పోలీసులు తెలిపారు ,గజ్వేల్ ఏసిపి నర్సింహులు కేసు వివరాలు తెలియపరుస్తూ కొడకండ్ల కు చెందిన జూపల్లి లక్ష్మి కొడకండ్ల డబుల్ బెడ్ రూమ్ లో ఉంటుంది ఈ నేల 16. నాడు ఉదయం తన ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్ళి తిరిగి సాయంత్రం 7.00 గంటలకు ఇంటికి వచ్చే చూడగా ఇంటి తాళం తీసి బెడ్ రూమ్ లోని బీరువా లో దాచి ఉంచిన 1. (5) గ్రాముల బంగారు కమ్మలు 2. (2) గ్రాముల బంగారు మాటీలు , 3. (2) ఒక జత పెద్ద పట్టగోలుసులు అవి 25 తులాలు , 4. రెండు జతల చిన్న పట్టగోలుసులు అవి అందాజ 14 తులాలు, కనిపించలేదని ఎవరో గుర్తుతెలియరు దొంగలు దొంగలించుకుని పోయినారని ఫిర్యాదు కుకునూర్ పల్లి యస్ ఐ కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించినాడు. నిందితుని ఆచూకి గురించి ఫిర్యాదు ఇంటి సమీపమున గల సి.సి కెమెరాలను ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుని కదలికలపై నిఘా వేయనైనది. నిందితులు బుధవారం సిద్ధిపేట లో అట్టి బంగారు వస్తువులు అమ్ముదామని కొడకండ్ల నుండి కుకునూర్ పల్లి వరకు అటో లో వచ్చి కుకునూర్ పల్లి వద్ద బస్ స్టాండ్ లో బస్ కోసం చూస్తుండగా పట్టుకున్నాము మహ్మద్ తాహెర( 40 )నేరస్తుని వద్ద నుండి 7 గ్రాముల బంగారు ఆభరణాలు, 39 తులాల వెండి వస్తువులు స్వాధీన పర్చుకోనైనది. నిందితున్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , సిబ్బంది రమేశ్ లను , అభినందించి త్వరలో పోలీస్ కమిషనర్ చేతులమీదుగా రివార్డు అందజేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో 30వ స్నాతకోత్సవం-

**– 214 మంది విద్యార్థులకు పట్టా ప్రదానం**
**౨ ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు**





**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 22 కరపత్రం ప్రతినిధి**
శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో బుధవారం 30వ స్నాతకోత్సవం (స్నాతక్ ఉత్సవం) వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 214 మంది విద్యార్థులు తమ పట్టాలను స్వీకరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో, వేద మంత్రోచ్చారణలతో, మంగళ వాయిద్యాల నడుమ వేదికపైకి చేరుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎ.ఐ.సి.టి.ఇ) చైర్మన్ ప్రొఫెసర్ టి. జి. సీతారాం వర్చువల్‌గా పాల్గొనగా, విశిష్ట అతిథిగా శక్తి ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ సీఈఓ రామకృష్ణ సాతలూరి హాజరయ్యారు. ప్రధాన అతిథి ప్రొఫెసర్ సీతారాం మాట్లాడుతూ, "నేటి సాంకేతికత ఆధారిత ప్రపంచంలో నైపుణ్యాలు, జ్ఞానం నిజమైన కరెన్సీ అని అన్నారు. ఈ స్నాతకోత్సవం మీ కృషి, పట్టుదల, అభ్యాసం ప్రతిఫలంగా నిలుస్తుంది" అని అభినందించారు. విశిష్ట అతిథి రామకృష్ణ సాతలూరి మాట్లాడుతూ, విద్యార్థులు వృత్తిపరమైన జీవితంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆవిష్కరణ, స్థిరత్వం, నైతిక నాయకత్వం వంటి విలువలను ఆచరించాలని సూచించారు. "భవిష్యత్ నాయకులుగా లాభాలకు మించి ఆలోచించి, సమాజానికి ప్రయోజనం చేకూర్చే మార్గంలో నడవండి అని సూచించారు. నిజమైన విజయం క్రమశిక్షణ, వినయం, నిరంతర అభ్యాసం మీద ఆధారపడి ఉంటుంది" అని ఆయన తెలిపారు. తన ప్రసంగంలో యువతను అతిగా ఆత్మవిశ్వాసం నుండి దూరంగా ఉండాలని సూచిస్తూ, "మీ జ్ఞానం మీకు నమ్మకం ఇవ్వాలి కానీ అహంకారం కలిగించకూడదు" అని సాతలూరి అన్నారు. అభిరుచి, కృషి, నీతి, వినయం, మానవత్వం వంటి విలువలు జీవితాన్ని అర్థవంతంగా మారుస్తాయని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందజేశారు. బంగారు పతకాలు, నగదు బహుమతులు పొందిన విద్యార్థులు: ప్రెసిడెంట్ బంగారు పతకం – పీజీడీఎం (నిర్వహణ విద్య) – చందనా నాయకల్ – 50,000, శివరాజ్ స్మారక బంగారు పతకం – మార్కెటింగ్ విభాగం – గోపు వందనా దశరథ్ – 25,000, లక్ష్మీదేవి స్మారక బంగారు పతకం – ఆర్థిక విభాగం – బొండిలి రెణుకాబాయి – 25,000, కవితా స్మారక బంగారు పతకం – మానవ వనరుల విభాగం – చందనా నాయకల్ – 25,000, ప్రెసిడెంట్ బంగారు పతకం – బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం – ప్రఖర్ సింగ్ – 50,000, ప్రెసిడెంట్ బంగారు పతకం – వ్యాపార విశ్లేషణ విభాగం – జ్యోతి చౌదరి – 50,000, శివ శివాని విద్యా సంస్థల అధ్యక్షురాలు , ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఆరతి సంపతి మాట్లాడుతూ, "విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా తమ ప్రతిభ, ప్రవర్తన, నైపుణ్యాలతో సంస్థకు, దేశానికి గౌరవం తెచ్చిపెట్టాలి అని అన్నారు. మన సంస్కృతిని గౌరవించడం ప్రతి భారతీయుడి కర్తవ్యం" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డాక్టర్ శైలేష్ సంపతి, సహాయ ఉపాధ్యక్షురాలు దీపికా సంపతి, డైరెక్టర్ డాక్టర్ అంబుజ్ గుప్తా, పరీక్షల నియంత్రకుడు కె. శ్రీహరి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. స్నాతకోత్సవం ముగింపు సందర్భంగా విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ, జీవితంలో కొత్త ప్రయాణానికి ఉత్సాహంగా ముందడుగు వేశారు.

# ఆర్ ఎస్ ఎస్ సంబరాలు



**అదిలాబాద్ బ్యూరో కరపత్రం ప్రతినిధి 22 అక్టోబర్ :**
భారతదేశంలో స్వయంసేవక్ సంఘ్ ఏర్పాటు చేసి నేటికి వందేళ్లు పూర్తి అవడం పట్ల ఆదివాసీ ఏజెన్సీ గిరిజన ప్రాంత నార్నూర్ మండల కేంద్రం లో సంబరాలు ను ఘనంగా నిర్వహించారు ప్రాంత ప్రముఖులు గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవర్ ఈ సంస్థను ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్నాయి. చాలా సంతోషం గా ఉంది అన్నారు.ఆర్ఎస్ఎస్‌కు దేశవ్యాప్తంగా 83 వేల శాఖలు ఉన్నాయి. లక్షల సంఖ్యలో వాలంటీర్లు ఉన్నారు. హిందువుల్లో ఐక్యత, క్రమశిక్షణ,క్యారెక్టర్ నిర్మాణం ఉద్దేశంతో హెడ్గేవర్ ఆ సంస్థను ప్రారంభించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పేరును ఓటింగ్ ద్వారా 1926లో ఫైనలైజ్ చేసినట్లు గా కొనియాడారు. కార్యక్రమంలో జ్ఞానోబా పుష్కర్ , మహేందర్ చౌవాన్ , విశాల్ కోటగిరి , ప్రకాష్ చలుర్కర్, గోవింద్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు




**గజ్వేల్ అక్టోబర్ 22, కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో బుధవారం నాడు చరిత్ర విభాగం ఆధ్వర్యంలో కొమరం భీమ్ 125 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ చరిత్ర విభాగాధిపతి గణపతి రావు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రసంగించారు. ఆదివాసి గిరిజన హక్కులపై అలుపెరుగని పోరాటం చేసి చివరికి తన ప్రాణాలు సైతం అర్పించిన మహనీయుడని ఆయన గుర్తు చేశారు. జల్, జంగల్, జమీన్ నినాదం తో ఆదివాసులను చైతన్యం చేసి వారి హక్కులకై ఆయన చేసిన త్యాగాలు మరువలేమని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అటానామి కోఆర్డినేటర్ డాక్టర్ డి. వెంకటేష్, సి ఓ ఈ కెప్టెన్ డాక్టర్ భవాని, అకాడమీక్ కోఆర్డినేటర్ విజయ్ భాస్కర్ రెడ్డి, తదితర అధ్యాపకులు,నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థులు పాఠశాల చదువుతో పాటు ఆరోగ్యపరమైన అలవాట్లను కూడా అలవర్చుకోవాలని

**– జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.**




**అదిలాబాద్ బ్యూరో 22 అక్టోబర్ కరపత్రం ప్రతినిధి**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన "ఆరోగ్య పాఠశాల" సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోందని, రక్తహీనత, ఐరన్ మాత్రల ప్రాధాన్యం వంటి అంశాలపై చైతన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతి నెల పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు కూడా ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని గుర్తించామని, వాటి నిర్మాణానికి ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరులు చేసినట్లు తెలిపారు. విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీంసరి పాఠశాల ఉపాధ్యాయుడు నీలం వెంకట్ రచించిన ఇంగ్లీష్ కవితను విద్యార్థులు నేహా, ప్రణవి పఠించారు. విద్యార్థులు ఆరోగ్య పాఠశాల ద్వారా పొందిన ప్రయోజనాలను పాటలు, ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. అలాగే విద్యార్థులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు.

అనంతరం ఆరోగ్య పాఠశాల ఇన్నోవేషన్ ఛాలెంజ్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు కలెక్టర్ నగదు పురస్కార ప్రొసీడింగ్ ఉత్తర్వులను అందజేశారు.

టి జి ఎం ఎస్ జైనథ్, గుడిహత్నూర్ పాఠశాలలకు చెరో రూ.50,000/-,
జిల్లా పరిషత్ పాఠశాల పిప్పార్ వాడ పాఠశాలకు రూ.25,000/-,
జిల్లా పరిషత్ పాఠశాల బోరిగాం పాఠశాలకు రూ.50,000/-,
జిల్లా పరిషత్ పాఠశాల రణదీవెనగర్ పాఠశాలకు రూ.75,000/- చొప్పున నగదు పురస్కారాలు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గజ్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**–గజ్వేల్ సిఐలు రవికుమార్,మురళి–**



**గజ్వేల్ అక్టోబర్ 22, కరపత్రం ప్రతినిధి**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రవేట్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సుమారు 200 ,మంది విద్యార్థులు, పాల్గొన్నారు. వారికి పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్ ఫంక్షన్ చట్టాలు అమలుపరుస్తున్న తీరు, కేసులు నమోదు, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, జరుగుతున్న సైబర్ నేరాల గురించి, పోలీస్ స్టేషన్లో ఉన్న వివిధ గదులు మరియు సీసీ కెమెరాలు ఫంక్షన్, డయల్ 100 ప్రాముఖ్యత, బ్లూ కోర్స్, పెట్రో కార్, పోలీసుల ముఖ్య విధుల గురించి తదితర అంశాల గురించి, పోలీసులు ఉపయోగిస్తున్న నూతన టెక్నాలజీ, సీఈఆర్ ద్వారా ఫోన్లో రికవరీ,కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ తదితర అంశాల గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి

# స్వాతి నక్షత్రం...నాచగిరీశుడికి అత్యంత శ్రేష్ఠమైనది

**– నాచగిరిలో...**
**వైభవంగా గిరి ప్రదక్షిణం**
**– స్వామివారి నామస్మరణతో మార్మోగిన నాచగిరి, శ్వేతగిరి కొండలు**
**– అంకురార్పణ చేసిన శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి**
**– ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త నేతృత్వంలో చక్కటి ఏర్పాట్లు**




**గజ్వేల్ అక్టోబర్ 22, కరపత్రం ప్రతినిధి**
శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం అత్యంత శ్రేష్టమైనది కాగా, ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్రంలో వైభవంగా గిరి ప్రదక్షిణం జరిగింది. మొదటగా క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీ గురు మధనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు నేతృత్వంలో పాలక మండలి సభ్యులు, సిబ్బంది చక్కటి ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున జరిగిన గిరి ప్రదక్షణలో శ్రీ నారసింహ నామస్మరణతో నాచగిరి, శ్వేతగిరి కొండలు మార్మోగగా, పాల్గొన్న వేలాది మంది భక్తులు భజనలు, ఆధ్యాత్మిక సంబరాల మధ్య తన్మయత్వం పొందారు. అనంతరం పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ ఆశీస్సులు అందజేశారు. శ్రీ స్వామివారి చల్లని చూపుతో అంతా మంచే జరుగుతుందని, ముఖ్యంగా భక్తుల కొంగుబంగారమైన, ఆరాధ్యదైవమైన శ్రీ నాచగిరీశుడి అనుగ్రహంతో విశేషమైన శక్తి ఉద్భవిస్తుందని, సిరి సంపదలతో తులతూగుతారని ఆకాంక్షించారు. ముఖ్యంగా స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం అత్యంత ప్రతిష్టాకరమైనది కాగా, గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులపై శ్రీ స్వామి వారి సంపూర్ణ ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని, తద్వారా మానవుడికి ముక్తి మార్గం లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# బేతిగల్ టు కరీంనగర్ నూతన బస్ సర్వీసును ప్రారంభించిన ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి వీణవంక అక్టోబర్ 22**

- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిన వేళ గ్రామస్తుల్లో ఆనందం.
- గ్రామాల అనుసంధానికి కాంగ్రెస్ పార్టీ మరింత కృషి.
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- ఘన స్వాగతం పలికిన బేతిగల్ గ్రామస్థులు.



నూతన బస్సు సౌకర్యం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు,ముఖ్యంగా స్కూల్స్,కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం నాడు హుజురాబాద్ డిపో పరిధిలో జమ్మికుంట నుండి వయా బేతిగల్,కేశవపట్నం మీదుగా కరీంనగర్ వరకు నూతన బస్ సర్వీసును గ్రామస్థులతో కలిసి ఆయన ప్రారంభించారు.30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బస్ సర్వీసు ప్రణవ్ ప్రారంభించడానికి రావడంతో గ్రామస్థులు బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ బస్ కోసం బేతిగల్ గ్రామ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళ ఈ రోజు నిజమయ్యిందని,ప్రతీ రోజు రెండుసార్లు సర్వీసు నడుస్తుందని దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం స్వయంగా బస్ టికెట్ తీసుకొని కొంతదూరం ప్రయాణించారు.జమ్మికుంట నుండి కరీంనగర్ వయా బెతిగల్ మీదుగా వెళ్ళే ఈ కొత్త బస్సు వారి ప్రయాణ సమయాన్ని తగ్గించి,భద్రతను పెంచుతుందని,మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనీ,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు.ఏళ్లుగా ఈ రూట్ లో బస్ సౌకర్యం కల్పించాలని ఎదురుచూస్తున్న ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించడం ఆనందంగా ఉందని దీనికి సహకరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామనీ అన్నారు.రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీనీ ఒక్కక్కటి పూర్తి చేస్తామని తెలిపారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

వీణవంక మండల పరిధిలోని బేతీగల్,వల్భాపూర్ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్..బేతిగల్ గ్రామంలో 4,వల్భాపూర్ గ్రామంలో 3 చెక్కులను 3,15,000/- రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసిన అనంతరం వెంటనే చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు..

# కరీంనగర్ జాగృతిలో మహిళల చేరిక.

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

కరీంనగర్ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బ్యూటీ అసోసియేషన్ అధ్యక్షురాలు రూప తోపాటు పలువురు మహిళలు జాగృతిలో చేరడం జరిగింది. భవిష్యత్తులో కవిత నాయకత్వంలో పనిచేస్తామని మహిళగా కవిత సమాజానికి ఎంతగానో సేవ చేస్తున్నారని, వారిని చూసి మాలాంటి వారందరము స్ఫూర్తి పొంది జాగృతి ద్వార ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో జాగృతిలో చేరడం జరిగిందని అన్నారు.జాగృతిలో చేరిన వారందరికీ జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి కండువాలు కప్పి వారిని జాగృతిలోకి ఆహ్వానించారు.



జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కవిత జాగృతి సంస్థ ద్వారా చేసే పోరాటాలతో ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం డిల్లీలో పార్లమెంటు సాక్షిగా జంతర్ మంతర్ దగ్గర దీక్షకు పూనుకొని కేంద్ర ప్రభుత్వంతో పోరాడి మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించిన ధైర్యం మనందరికీ తెలిసిందే అనీ,దక్షిణ భారత దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళగా జాగృతి అధ్యక్షురాలు కవిత ఉన్నారని, ఇప్పుడు ఉన్న రాజకీయలలో దక్షిణ భారతదేశంలో మహిళా నాయకత్వం లేదని మనకు కవిత రూపంలో ఆ లోటు తీరుతుందని హరిప్రసాద్ అన్నారు. తెలంగాణలో జాగృతిని మరింత బలోపేతం చేయడంలో మహిళల పాత్ర కీలకమని కవితను ఆదర్శంగా తీసుకొని చాలామంది మహిళలు జాగృతిలో చేరడం కోసం ముందుకు వస్తున్నారని అలాంటి వారందరినీ జాగృతిలోని ఆహ్వానిస్తున్నామని ,కవిత నాయకత్వంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ఈ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకంలో 2500 ఇస్తా అని చెప్పి మోసం చేసిన విధానం మీద, కళ్యాణలక్ష్మి క్రింద తులం బంగారం ఇవ్వకుండ మోసం చేసిందని, వృద్ధులకు నాలుగు పింఛన్ ఇస్తానని ఎగనామం పెట్టిందనీ ,డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల ఇవ్వడం లేదు, మహిళ విద్యార్థినిలకు స్కూటీ ఇస్తామని చెప్పి కూడ మోసం చేసిందని మహిళలను ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి అటో సంఘం నాయకులు కోత్తురి రఘు, మహిళ నాయకురాలు విజయ, అనుష, కవిత, శ్రీమతి, జ్యోతి, అనిష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకు డిపాజిట్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



- కేడీసిసి బ్యాంకు డీజిఎం బ్రహ్మానంద రావు

**కరపత్రం ప్రతినిధి మంథని అక్టోబర్ 22**

సహకార బ్యాంకు డిపాజిట్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేడీసిసి బ్యాంకు డీజిఎం బ్రహ్మానంద రావు కోరారు. కేడీసిసి బ్యాంకు డీజిఎం బ్రహ్మానంద రావు,ఏజీఎంలు ఇంతియాజ్ ఆలీ, లోకే రాజశేఖర్,మేనేజర్ ఉదయశ్రీ, బ్యాంకు, సహకార సంఘం సిబ్బంది మంథని పట్టణంలో ఇంటింటా తిరుగుతూ కేడీసిసి డిపాజిట్ పథకాలపై అవగాహన కల్పిస్తూ డిపాజిట్ లు సేకరించారు. ఈ సందర్భంగా కేడీసిసి బ్యాంకు డీజిఎం బ్రహ్మానంద రావు మాట్లాడుతూ సహకార బ్యాంకు చేసే డిపాజిట్ల పై ఖాతా దారులకు పూర్తి భద్రత ఉంటుందని తెలిపారు. ఇతర బ్యాంకు లకంటే ఎక్కువగా సహకార బ్యాంకు లో డిపాజిట్స్ పై అధిక వడ్డీ రేటు పొందవచ్చని తెలిపారు. 333రోజులకు గాను సాధారణ పౌరులకు వడ్డీ రేటు 8శాతం, సీనియర్ , మహిళలకు అత్యధికంగా 8.50శాతం వడ్డీ రేటు ఉందని, దీనిని ప్రజలు, ఖాతాదారులు ఉపయోగించుకోవాలని కోరారు. అంతే గాకుండా బ్యాంక్ ద్వారా దీర్ఘకాలిక, గోల్డ్ లోన్స్, హౌజింగ్ లోన్స్, విదేశీ విద్యా ఋణాలు, మార్టిగేజ్ ఋణాలు, ఎస్ హెచ్ జి, జెఎల్ జి ఋణాలు, అలాగే ఇళ్ల రిపేరుకు, ఇంటిరియర్ డెకరేషన్ కు, పిఎంఇజిపి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఋణాలు సేరి కల్చర్, ఆయిల్ ఫాం తోటల పెంపకానికి ఋణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంక్ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా పథకాలను ఖాతాదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో డిఈ లు సందేబోయిన శ్రీనివాస్, దిలీప్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు మాచిడి శ్రీనివాస్, పోతరాజు సతీష్ కుమార్, బూడిద వసంత, కీర్తన, లాస్య, బ్యాంకు సిబ్బంది మహేందర్, అమరేందర్, మహేశ్వరి, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, దుబ్బాక సదాశివ్, నారమల్ల విద్యాసాగర్, బొద్దుల సమ్మయ్య, పైడాకుల రాకేష్, గుడెల్లి మధుమోహన్, మోతుకూరి శేఖర్, రాగం అశోక్,తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర దాత ఈరవేణి రాజయ్య చూపు సజీవం...





- నేత్రదానం పై అపోహలు వద్దు...
- రాజయ్య సంస్మరణ సభలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు...

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, అక్టోబర్ 22**

నేత్రదానంపై అపోహలు అవసరం లేదని మన మరణానంతరం మన నేత్రాలను దానం చేయడం వల్ల మరో ఇద్దరి అందులకు చూపు ప్రసాదించిన వారు అవుతామని సదాశాయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి తెలిపారు. బుధవారం నేత్రదాత ఈరవేణి రాజయ్య సంస్మరణ సభను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు మండలంలోని కోర్కల్ గ్రామంలో నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి రాజయ్య కుటుంబానికి అభినందనలు తెలిపిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన రాజయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేసి ఇద్దరి అందులకు చూపును ప్రసాదించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలోసదాశయ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనినారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించి జ్ఞాపికను భార్య లక్ష్మి, కుమారులు, రాజ్ కుమార్ , శ్రీధర్ కుటుంబ సభ్యులకుఅందజేసి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు .ముస్త్యాల జగదీశ్వర్ వంగల రమేష్, చిదురాల శ్రీనివాస్, బండి మల్లేష్ (కానిస్టేబుల్), రామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదుల సంఘం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆరు నెలల కాలం మెటర్నటీ సెలవులో వెళ్లి, నేడు తిరిగి మళ్ళీ బాధ్యతలు చేపట్టడంతో బుధవారం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బెంచ్ కు బార్ కు మధ్య సత్సబంధాలు బలంగా ఉండాలని, న్యాయవాదులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ గుజ్జే మనోహర్, సీనియర్ ఈసీ మెంబర్ కనికరపు శ్రీనివాస్, లేడీ రిప్రజెంటివ్ జక్కుల పద్మ, జూనియర్ ఈసీ మెంబర్లు యమ తిరుపతి, బూర సరిత ఉన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు గాదె శివాస్ ఎంపిక

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



కరీంనగర్ పట్టణంలోని జ్యోతి నగర్ కు చెందిన గాదె శివాస్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్జిఎఫ్ అండర్ 14 చెస్ పోటీలలో ఏడవ తరగతి చదువుతున్న గాదె శివాస్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచాడు.దీంతో శివాస్ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి రాణించాలని జ్యోతి నగర్ కాలనీవాసులు కోరారు. ఈ సందర్భంగా శివాస్ ను కాలనీవాసులు అభినందించారు.

## ప్రమాదవశాత్తు కాలు తొలగించిన వారికి కృత్తిమ కాలు అమర్చిన ఆలయ ఫౌండేషన్





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 22**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్న పల్లి కి చెందిన పూరెల్ల రాజయ్య కు ప్రమాదవశాత్తు తన కుడికాలు కోల్పోయి ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత ను సంప్రదించగా ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో శ్రీ భగవాన్ మహావీర్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో అతనికి జైపూర్ ఫుట్ ను అందించడం జరిగిందిఆలయఫౌండేషన్ గత పది సంవత్సరాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్ వరంగల్ జిల్లాలలో విద్యా వైద్యం ఉపాధి కార్యక్రమాలను చేస్తున్నాముతలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏజెన్సీ ప్రాంతాలలో ఉచిత కంటి శిబిరాలు వికలాంగులకు ప్రత్యేకంగా క్యాంపు లను ఏర్పాటు చేస్తున్నాము మధ్యప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ లో వుంటూ జన్మభూమి పై సేవ చేయడం చాలా హర్షణీయం ఈ కార్యక్రమంలో ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత రాజు పాల్గొన్నారు

# పత్రికా కార్యాలయాలపై దాడులు అమానుషం

- బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- టీడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు


**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



నమస్తే తెలంగాణ దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రజాప్రతినిధి అయినా ప్రజాస్వామ్యంలో నాలుగోస్థంభంగా ఉన్న మీడియాపై బెదిరింపులకు దిగటం సరికాదన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేఛ్చ పత్రికలకు ఉంటుందని, పేపర్లలో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటికి ఖండనలు ఇవ్వటం, వివరణలు ఇవ్వటం చేయాలి కానీ బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగటానికి ప్రజాస్వామ్యంలో చోటులేదన్నారు. భావప్రకటనా స్వేఛ్చ పై దాడి సరికాదని, తక్షణమే పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన వారిని అరెస్టు చేసి, దాడికి ఉసిగొల్పిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## జమ్మికుంట రైల్వే స్టేషన్ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 22**



జమ్మికుంట రైల్వే స్టేషన్ ప్లాటుఫారం పై ఒక గుర్తు తెలియని పురుషుడు వయసు సుమారు 65-70 సంవత్సరాలు బహుశా ఎదో అనారోగ్యం వలన క్రింద పడగ చనిపోయినాడు అని తెలుయుచున్నది. మృతుడు లేత గ్రీన్ రంగు హాఫ్ టీ షర్ట్ తెలుపు ధోతి ధరించి ఉన్నాడు ప్రక్కన చేతి కర్ర కలదు. అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు గాని వస్తువులు గాని లేవు. శవాన్ని ప్రభుత్వ హాస్పిటల్ జమ్మికుంట మార్చరీ లో భద్రపర్చానైనది. ఇట్టి కేసును నేను జి. తిరుపతి ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రామగుండం పరిశోదనా చేయుచున్నాను ఏమైనా వివరాలు తెలిసినచో ఫోన్ నెంబర్ 9949304574, 8712658604 కి సమాచారం ఇవ్వగలరని మనవి.